క్లుప్తంగా

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎన్‌సీడీ–సీడీ సర్వే పరిశీలన



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేను ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ బుధవారం పరిశీలించారు. సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్టీ కాలనీలో జరుగుతున్న సర్వేను దుర్గాప్రసాద్ పరిశీలించి రోగులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. బీపీ, షుగర్‌లపై నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా దానియేల్



కాకుమాను: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షుడిగా డి.దానియేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోల సంఘం ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా బోడిపాలెం వీఆర్వోగా పని చేస్తున్న డి.దానియేల్‌ను మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జె.శింగారావు, ఉపాధ్యక్షునిగా పి.అజయ్, సహాయ కార్యదర్శిగా కె.సత్యానందం, ట్రెజరర్‌గా బోడిమ్మలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన దానియేల్ మాట్లాడుతూ మండలంలో వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నూతన కమిటీ వివరాలను తహసీల్దార్ వెంకటస్వామికి అందజేశారు.

ఫిబ్రవరి 2న మెగా కంటి వైద్య శిబిరం

పెదకాకాని: శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం ఫిబ్రవరి 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెనిగండ్ల శ్రీ వేమన జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలతో పాటు కుటుంబసభ్యుల ఫోన్ నంబరు తీసుకురావాలని కోరారు.

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్, వీసీ కె.గంగాధరరావు తెలిపారు. 'జనరేటివ్ ఏఐ ఆపర్చునిటీస్ అండ్ థ్రెట్స్' అనే అంశంపై యూజీసీ సహకారంతో ఫిబ్రవరి 14, 15 తేదీల్లో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంలో డాక్టర్ బి.బసవేశ్వరరావు, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమ, డాక్టర్ యు.సూర్యకామేశ్వరి, డాక్టర్ ఆర్.వసంత, ఎ.పుష్పలత పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ

ప్రత్తిపాడు: హెల్మెట్ ధారణతో వాహన చోదకుల ప్రాణాలకు రక్షణ ఉంటుందని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ విత్ హెల్మెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ భానూదయ, స్థానిక రామవాగు సెంటరు వద్ద బైక్ ర్యాలీని ప్రారంభించారు. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డులో పాత మల్లాయపాలెం కూడలి, అంకమ్మగుడి సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు హెల్మెట్లు ధరించి పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, ద్విచక్ర వాహనదారులు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. రహదారులు ప్రగతికి చిహ్నాలని, అలాంటి రహదారులపై ప్రజల భద్రత కూడా హక్కేనన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సర్కిల్ సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.నాగేంద్ర పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో బైక్ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ

హెల్మెట్ ధరించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలి...

పెదకాకాని: ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీఐ టీపీ నారాయణస్వామి అన్నారు. పెదకాకాని వై జంక్షన్‌లో పోలీసుస్టేషన్ ఎదుట వాహనదారులకు హెల్మెట్ వాడకం వలన కలిగే ఉపయోగాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా క్షేమంగా గమ్యానికి చేరుకోవచ్చన్నారు. చిన్నచిన్న కారణాలు చూపించి హెల్మెట్ ధరించకుండా పక్కన పెట్టడం మంచిదికాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, తలకు బలమైన గాయాలు తగలకుండా ప్రాణాలు కాపాడటంలో హెల్మెట్ పాత్ర ముఖ్యమైందన్నారు. మద్యం తాగి వాహనాలు నడప రాదని, అలానే ట్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే, వారి మీద చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పెదకాకాని ఎస్ఐ మిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధుల స్వాహాపై చర్యలు

- బినామీ కూలీల పేర్లతో అక్రమాలు, పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగులోకి..
- షోకాజ్ నోటీసులు, జరిమానాలు విధించిన డ్వామా పీడీ శంకర్



ఏపీఓని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ శంకర్

పొన్నూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో మండలంలోని కొన్ని పంచాయతీల్లో కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, బినామీ వేతనదారుల పేర్లు, పనులు చేయకుండానే చేసినట్లుగా చూపి ఫీల్డ్ అసిస్టెంట్లు, పలువురు సిబ్బంది నగదు స్వాహా చేశారని సామాజిక తనిఖీ బృందాల సభ్యులు బహిర్గతం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పొన్నూరు మండలంలోని 24 పంచాయతీల్లో నిర్వహించిన 1,595 ఉపాధి హామీ పథకం పనులకు రూ.5,98,26,632 కోట్లు కూలీల వేతనాలు, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.9 కోట్ల18 లక్షల 29 వేలు ఖర్చు చేశారు. ఈ పనులపై నిర్దేశించిన ఆరు సామాజిక తనిఖీ బృందాల సభ్యులు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి అక్రమాలపై గ్రామస్థాయిలో సభలు నిర్వహించారు. తుది విచారణలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో తనిఖీ బృందాలు బహిర్గతం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వి.శంకర్, చీఫ్ విజిలెన్స్ అధికారి శ్రీ భవాని హర్ష పాల్గొని విచారణ చేపట్టారు. పలు గ్రామాల్లో బినామీ పేర్లతో కూలీల వేతనాలు స్వాహా చేసినట్లు తేలింది. కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీఓ గణపతి, సీఓ, ఎఫ్ఏలకు ఒక్కొక్కరికీ రూ. 3 వేల అపరాధ రుసుంతో పాటు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీపీఓను ఆదేశించారు. వారితో పాటు సీతారాంపురంలో అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రికవరీ, షోకాజ్ నోటీసు ఇవ్వాలని కోరారు. కూలీలకు వంద రోజుల పాటు పని కల్పించడమే ధ్యేయంగా ఉపాధి సిబ్బంది బాధ్యతలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, అముర్స్ పర్సన్ కోముది, డీవీఓ హనుమంతరావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని చౌడవరం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో నివసించే ప్రజలకు నగరపాలక సంస్థ నుంచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. గృహకల్ప బ్లాక్‌ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 2 రోజుల్లో చుట్టూ ఉన్న పొదలు తొలగించాలని, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గృహకల్ప ప్రాంతంలోని బోర్లు మరమ్మతులు చేయాలని, అవసరమైతే నూతన మోటార్ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ సతీష్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్ ఉన్నారు.



రాజీవ్‌గృహకల్పను పరిశీలించి సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్

భూ సమస్యలపై అర్జీలను వెంటనే పరిష్కరించాలి



పొన్నూరు: రెవెన్యూ సదస్సులలో సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ జియావుల్‌హక్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 656 స్వీకరించినట్లు, వాటిలో ఇప్పటి వరకు 580 పరిష్కారమయ్యాయని, మిగిలిన 43, సర్వేకు 33 అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు రామారావు, అహ్మద్ పాల్గొన్నారు.

పట్టపగలు మూడు ఇళ్లలో చోరీ

గుంటూరు రూరల్: పట్టపగలు ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి మూడు ఇళ్లలో చోరీ చేసిన ఘటన మండలంలోని వెంగళాయపాలెంలో చోటుచేసుకుంది. బాధితులు, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. గ్రామంలోని లక్ష్మీనరసింహపురం కాలనీలో వరసగా ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయారు. వి.అనిల్ కుమార్ భార్య బిడ్డలతో కలసి ఒక ఇంట్లో నివసిస్తూ మిర్చి యార్డులో కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడు. అనిల్ పనికి వెళ్లగా భార్య అతనితో పాటే పిల్లలను స్కూలుకు పంపి కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం తీసి బీరువాలోని బట్టలు వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఇంటి బీరువాలోని బంగారు నాన్‌తాడు, నగదు రూ.50 వేల వరకూ, వెండి వస్తువులు అపహరించారని బాధితుడు వాపోయాడు. పక్కనే ఉండే పాలపర్తి నాగరాజు కూలీ పనులు చేసుకుంటుండగా భార్య నగరంలోని డీమార్ట్‌లో పనిచేస్తోంది. అతడి ఇంట్లో రూ.55 వేలు, బంగారు వస్తువులు అపహరించారు. అదే విధంగా పక్కనే ఉన్న పీ వెంకటనాగరాజు స్థానిక ప్రైవేటు పాఠశాలలో రోజువారీ కూలీగా పనిచేస్తుంటాడు. అతడి ఇంట్లో రూ.60 వేలు, బంగారు వస్తువులు అపహరించారని వాపోయాడు. మూడు ఇళ్లతోపాటు ఖాళీగా ఉన్న మరో ఇంటి తాళాలు పగలగొట్టి ఇల్లు ఖాళీగా ఉండటంతో దుండగులు వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు, స్థానికంగా ఉన్న సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

జీవవైవిధ్య శాస్త్రంపై విస్తృత పరిశోధనలు జరగాలి

ఏఎన్‌యూ రెక్టార్ రత్న షీలా మణి

ఏఎన్‌యూ: జీవవైవిధ్యంపై విస్తృత పరిశోధనలు అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ కె.రత్న షీలా మణి అన్నారు. విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాల ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యునాలజీ, అండ్ బయోడైవర్సిటీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టార్ కె.రత్నషీలామణి పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిస్థితులు రోజుకు విషతుల్యంగా మారుతున్నాయని చెప్పారు. వాటిపై పరిశోధకులు పరిశోధనలు చేయాలని పేర్కొన్నారు. ఎన్నారై మెడికల్ కళాశాల పల్మనాలజీ విభాగాధిపతి ఆర్.రామకృష్ణ, రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా పరిశోధకులు, విద్యార్థులు, వివిధ సంస్థల శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలను పాటించి నూతన పరిశోధనలను అన్వేషించాలని కోరారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య మాట్లాడుతూ మానవాళి మనుగడకు వాతావరణ కాలుష్యం ముప్పు కలిగించేదిగా ఉంటాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం యువత అడుగులు వేయాలన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ రెక్టర్ ఆచార్య ఎం.భాస్కర్, సదస్సు డైరెక్టర్ వి.వెంకటరత్నమ్మ మాట్లాడారు. సదస్సులో కో డైరెక్టర్ పి.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్ నాయక్, అధ్యాపకులు సుమంత్ కుమార్, పి.వి.కృష్ణ, గోపాలరావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రెక్టార్ .రత్నషీలామణి

సంక్షిప్తం

• మంచాలలో భూముల రీ సర్వే

చేబ్రోలు: మండలం మంచాలలో పైలట్ ప్రాజెక్ట్ కింద భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టారు. బుధవారం తెనాలి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఐఓసీ) ఎం.పార్థసారథి తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. రైతులకు భూముల రీ సర్వే వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐఓఎస్ పార్థసారథి మాట్లాడుతూ భూ యజమానుల సమక్షంలో వారి ఆమోదంతోనే రీ సర్వేను సిబ్బంది చేస్తున్నట్లు తెలిపారు. 783 ఎకరాలు ఉన్న మంచాల గ్రామాన్ని నాలుగు బ్లాక్‌లుగా విభజించి, రెండు బృందాల్ని ఏర్పాటు చేసి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ ఎం.సునీల్, వీఆర్వో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

• ఎన్జీరంగా వర్సిటీ సందర్శన

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని యూఎస్ఏకు చెందిన ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మీదేవి మాట్లాడుతూ ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన ఐదుగురు ప్రతినిధులు విశ్వవిద్యాలయంలో పర్యటించారన్నారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన వారిలో ఫుడ్ అండ్ నేచురల్ రిసోర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెస్కాట్‌ఏం గిల్, డైరెక్టర్ ఆఫ్ గ్లోబల్ ఫుడ్ సిస్టమ్స్ ఎడ్‌టోలాటి ఎడిసన్, అగ్రిబయాలజికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయగోపాల్ కాకాని, ప్రొఫెసర్ అగ్రిబయాలజికల్ ఇంజినీరింగ్ డాక్టర్ జస్మిత్‌జజ్, గ్లోబల్ ఫుడ్ సిస్టమ్స్ ఇనిస్టిట్యూట్, సాయిల్ వాటర్ ఇకో సిస్టమ్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఆండ్రూజోగ్రామ్‌లు విశ్వవిద్యాలయంలోని డ్రోన్ టెక్నాలజీ విభాగం, పరిశోధన క్షేత్రాలు, పరిశోధన శాలలను సందర్శించారన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ఇంజినీరింగ్ విభాగం డీన్ డాక్టర్ ఎ.వాణి, పరిశోధన సంచాలకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బైక్‌ను కారు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పొన్నూరు రూరల్ మండలం కసుకర్రు గ్రామానికి చెందిన వెంకట పూర్ణారెడ్డి గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గ మధ్యలో నారాకోడూరు గ్రామ శివారులోని ఆల్ఫా హోటల్ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకట పూర్ణారెడ్డి కాలు విరిగింది. కాళ్లు, చేతులకు గాయాలైన బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• సీసీఆర్సీ కార్డులపై కౌలు రైతులకు రుణాలు

ప్రత్తిపాడు: సీసీఆర్సీ కార్డుల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్‌బీఐ మేనేజర్ అజయ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సీసీఆర్సీ కార్డులపై కౌలు రైతులకు బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కౌలు రైతులు కచ్చితంగా సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలని, పంట కాలపరిమితి ఆధారంగా కార్డులపై రుణాలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ సీతారామంజనేయులు, ఏవో అరుణకుమారి పాల్గొన్నారు.

• డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కాకుమాను: మంచు కారణంతో ఆర్టీసీ బస్సు సైడు కాలువలోకి వెళ్లిన ఘటన బుధవారం వేకువజామున పెదనందిపాడు శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. పర్చూరు నుంచి గుంటూరు వరకు పల్నాడు లింకుకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 5 గంటలకు పర్చూరు నుంచి గుంటూరుకు బయలు దేరింది. పెదనందిపాడు శివారు వద్ద మంచు అధికంగా ఉండటంతో డ్రైవర్‌కు రోడ్డు కనిపించకపోవడంతో నల్లమడ వాగు సమీపంలోని సైడు కాలువలోకి దూసుకువెళ్లింది. ఆ సమయంలో బస్సుల్లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

• ఆడపిల్లలను రక్షించుకుందాం

ప్రత్తిపాడు: ఆడపిల్లలను రక్షించుకుందామని, అది మనందరి సమష్టి బాధ్యతని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పెదగొట్టిపాడు ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు బాలికా సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, మహిళలు పుట్టే బిడ్డల విషయంలో లింగ వివక్షను చూపవద్దన్నారు. లింగవివక్ష చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అదేవిధంగా బాల్య వివాహాలను చేసినా ప్రోత్సహించినా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.